

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మార్చి 7: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మేడిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చెప్టా తండాలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం కత్వవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాగూర్ బాలాజీసింగ్, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ అభిషేక్‌రెడ్డి, ఎంపీవో వినోద, మాజీ ఎంపీపీ అనితావిజయ్, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జగన్, మానయ్య, నాయకులు కృష్ణానాయక్ మెకానిక్ బాబా, విజయ్, విజయ్ రాథోడ్, సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

## సకాలంలో పన్నులు చెల్లించాలి



ప్రచార ఆటోలను ప్రారంభిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

తుర్కయాంజాల్, మార్చి 7: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వసూలుకు మున్సిపల్ అధికారులు వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నారు. అందులో భాగంగా పన్నులను వెంటనే చెల్లించాలంటూ ఆటోలకు మైకులను ఏర్పాటు చేశారు. శుక్రవారం కమిషనర్ అమరేందర్‌రెడ్డి ఆటోలను ప్రారంభించి కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా సకాలంలో పన్నులను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. మార్చి 31లోపు పన్నును చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మేకల మండి యార్డును ఏర్పాటు చేస్తాం



మొయినాబాద్‌లో మార్కెట్ యార్డు స్థలం, గోదాములను పరిశీలిస్తున్న చైర్మన్ సురేందర్‌రెడ్డి

మొయినాబాద్, మార్చి 7: సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న మొయినాబాద్ మార్కెట్ గోదాము స్థలంలో మేకల మండి యార్డును ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో గతంలో నిర్మించిన గోదాములను శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యదర్శి సుజాత, డైరెక్టర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొయినాబాద్‌లో ఉన్న మార్కెట్ యార్డుకు సంబంధించిన స్థలాన్ని అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఆ స్థలంలో గోదాముల నిర్మాణం చేపట్టామని, అంతే కాకుండా కూరగాయల మార్కెట్‌తో పాటు మేకల మండిని కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య, డైరెక్టర్లు బాలకృష్ణారెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, రవి, వెంకట్‌రెడ్డి, నిఖిల్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్‌రూరల్, మార్చి 7: ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల గ్రామంలో అర్హులైన ఉపాధి హామీ కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని గ్రామకార్యదర్శి యాదయ్య అన్నారు. గ్రామశివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం ఉన్నందున ఉపాధిహామీ కూలీలు ఉదయం సమయంలోనే పనులను పూర్తిచేసుకోవాలన్నారు. కూలీలకు అన్ని మౌలిక వసతులను అందుబాటులో వుంచామన్నారు. గ్రామంలో రెండోరోజు 21మందికి ఉపాధి హామీ పనుల నిర్వహించినట్లు తెలిపారు.

## నిషేధిత డీజే వినియోగంపై జరిమానా

చేవెళ్లటౌన్, మార్చి 7: నిషేధిత డీజేని వినియోగించినందుకు ఒక్కొక్కరికీ రూ.6వేల చొప్పున ముగ్గురికి రూ.18వేల జరిమానాను చేవెళ్ల మెజిస్ట్రేట్ విధించారు. చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల గ్రామానికి చెందిన నాయక్, హరీశ్వర్, శివలు ఈ నెల 4వ తేదీన అర్ధరాత్రి 2గంటల సమయంలో నిషేధిత డీజేను వినియోగించగా, పోలీసులు వారిని అరెస్టు చేసి శుక్రవారం చేవెళ్ల మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచడంతో ఒక్కొక్కరికీ రూ.6వేల చొప్పున ముగ్గురికి రూ.18వేల జరిమానా విధించారు. నిషేధిత డీజేలను వాడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

కొందుర్గు, మార్చి 7: చౌదరిగూడ మండలంలోని ఎనెగుండు వద్ద గల సర్వే నంబర్ 142/2లోని 4.20ఎకరాల భూమిలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్‌కు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4.20ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలోనే పేదలకు ఇస్తామని చెప్పారన్నారు. మరోమారు 2.20ఎకరాల భూమిలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తామని చెప్పారన్నారు. ఇక మిగిలిన 2ఎకరాల భూమిలోనైనా నిరుపేదలకు ఇండ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్, మండల కౌన్సిల్ సభ్యులు కృష్ణ, చెన్నయ్య, షబ్బీర్, లక్ష్మమ్మ, లింగం పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### యాచారంలో పోలీసుల సైకిల్ పెట్రోలింగ్

యాచారం, మార్చి7: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసులు శుక్రవారం సైకిల్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్‌లో సైకిల్‌పై తిరుగుతూ సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సక్రూనాయక్ మాట్లాడుతూ..ప్రజలు దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా యువత గంజాయి, డ్రగ్స్, మద్యపానం, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండేలా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్‌రూల్స్, పోలీసుల నిబంధనలు పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే 100నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



## తాగునీటి సమస్య తలెత్తవద్దు

కేశంపేట, మార్చి 7: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయాశాఖల అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇంటితోపాటు రేషన్‌కార్డులు జారీ చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. వేసవిలో మండలంలోని ఏ గ్రామంలోనూ నీటి సమస్య తలెత్తవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవి చంద్రకుమార్‌రెడ్డి, ఎంఈవో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని అడ్డుకోవడానికి కుట్ర

### కాంగ్రెస్ నాయకులే రాద్ధాంతం చేస్తున్నారు

### ఎతుబార్‌పల్లి దళిత వాడ ప్రజలు ఆరోపణ

మొయినాబాద్, మార్చి 7 : అభివృద్ధిని అడ్డుకోవడానికి కొందరు కాంగ్రెస్ నాయకులు కుట్ర చేస్తున్నారని దళిత వాడ ప్రజలు ఆరోపించారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఎతుబార్‌పల్లి గ్రామంలోని దళిత వాడకు ఎస్సీ సబ్ ప్లాన్ కింద సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయి. ఎమ్మెల్యే కాలె యాదయ్య ఇతర పార్టీల నాయకులకు వర్క్ ఆర్డర్ ఇచ్చారని కొందరు కాంగ్రెస్ నాయకులు ఆరోపించడంలో వాస్తవం లేదని, వారికి వర్క్ ఆర్డర్ రాలేదని కుట్రతోనే అనవసరంగా ఆరోపణలు చేస్తూ పనులను అడ్డుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని దళిత వాడ ప్రజలు మండిపడుతున్నారు. సీసీ రోడ్డు పనులను చేయడానికి కాంగ్రెస్ నాయకులకే వర్క్ ఆర్డర్ ఇచ్చారని ఎస్సీ వాడ ప్రజలు తెలిపారు. ఈ విషయంలో అనవసరంగా



సీసీ రోడ్డు పనులను అడ్డుకోవద్దని ఆందోళన చేస్తున్న దళిత వాడ ప్రజలు

రాజకీయం చేయకుండా సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సహకరించాలని దళిత వాడ ప్రజలు కోరుతున్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంచాల, మార్చి 7: పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాండు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ఎంపీడీవో బాలశంకర్‌తో పాటు ఎంపీవోలకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు భాస్కర్, రవి, గోపాల్, దాసు, సురేశ్, అంజయ్య పాల్గొన్నారు.

**యాచారం :** గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీవో శ్రీలతకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చందు నాయక్ మాట్లాడుతూ..గ్రామపంచాయతీ సిబ్బందికి పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండో పీఆర్సీ పరిధిలోకి పంచాయతీ సిబ్బందిని తీసుకురావాలని జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు కృష్ణ, నరేందర్, రాములు ఉన్నారు.



మంచాల: ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే కాలె యాదయ్య కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



షాబాద్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్, మార్చి 7: గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో 91 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, ఏడుగురికి షాదీముబారక్ చెక్కులను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎం.మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ గౌతంకుమార్‌లతో కలిసి పంపిణీ చేశారు. అదే విధంగా అజీజ్‌నగర్ గ్రామంలోని మొయినాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం, అధికారుల చాంబర్లను మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్, ఎంపీడీవో సంధ్యలతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా మొయినాబాద్ మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో రూ.4 లక్షల సీఆర్ఆర్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లోని ఎస్సీ వాడలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎస్సీ సబ్ ప్లాన్ కింద నిధులు కేటాయించి సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువ నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌతంకుమార్, డీటీ వినోద్, పీఆర్ డీఈ విజయ్‌కుమార్, ఏఈ సూర్యనారాయణ, టీపీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్, మొయినాబాద్ పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య, మాజీ సర్పంచ్ ప్రవీణ్, మాజీ ఎంపీటీసీలు రాంరెడ్డి, మల్లేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విఘ్నేష్‌రెడ్డి, నాయకులు రాములు, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, రవీంద్‌రెడ్డి, యాదయ్య, భాస్కరాచారి, హనుమంత్‌యాదవ్, యాదగిరిచారి, విక్రంరెడ్డి, గౌతంరెడ్డి, రాజశేఖర్, కిరణ్, భాస్కర్ పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

షాబాద్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్లు సురేందర్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, డైరెక్టర్ శ్రీరాంరెడ్డి, బుగ్గరామేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ వెంకటయ్య, మాజీ సర్పంచులు రవీందర్, జనార్దన్‌రెడ్డి, రవీందర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, లింగం, శేఖర్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ అశోక్, నాయకులు పాల్గొన్నారు.

**చేవెళ్ల రూరల్ :** శంకర్‌పల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి మంజూరైన రూ.91,10,556 లక్షల చెక్కులను శంకర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య అందజేశారు. అదేవిధంగా సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.9,47,500 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో వెంకయ్య గౌడ్, తహసీల్దార్ సురేందర్ పాల్గొన్నారు.

**చేవెళ్లటౌన్ :** చేవెళ్ల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య చేవెళ్ల మండలానికి చెందిన 16 మందికి మంజూరైన రూ.16,01,856 కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల తహసీల్దార్ కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు రాములు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

కేశంపేట, మార్చి 7: స్నేహితుడి మృతి తనను తీవ్రంగా కలిచివేసిందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. కేశంపేట మండలం పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ వీఆర్వో నర్సింహారావు(75) మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆయన శుక్రవారం గ్రామానికి చేరుకొని నర్సింహారావు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, షాద్‌నగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్.నటరాజ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు భూపాల్‌రెడ్డి, యారం శేఖర్‌రెడ్డి, శేఖర్‌పంతులు, జగన్‌మోహన్‌రెడ్డి, జమాల్‌ఖాన్, అంజయ్య, రఘునందన్‌రెడ్డి, రంగారెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల్లో తనిఖీ

చేవెళ్లటౌన్, మార్చి 7: చేవెళ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను శుక్రవారం చేవెళ్ల తహసీల్దార్ కిష్టయ్య తనిఖీ చేశారు. భారీ బందబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## టీఎన్జీవో జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా అమృత

షాద్‌నగర్‌టౌన్, మార్చి 7: తెలంగాణ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (టీఎన్జీవో) జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్‌గా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ అమృత ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి విజయ్, షాద్‌నగర్ టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డివిజన్ టీఎన్జీవో సభ్యులు రమాదేవి, శ్రీలత, వీణ, పార్వతి పాల్గొన్నారు.

## దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేత

మంచాల, మార్చి 7: మంచాల గ్రామానికి చెందిన దివ్యాంగులకు బస్‌పాస్ రెన్యువల్ కోసం ఆర్టీసీ డిపో-2 అధికారి అంజయ్యకు తాళ్లపల్లిగూడ భవాని రామలింగేశ్వరస్వామి దేవాలయ ట్రస్ట్ చైర్మన్ భిక్షపతి శుక్రవారం తన సొంత డబ్బుల సహకారంతో దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు అశ్వల బాల్‌రాజ్, దివ్యాంగులు రమేశ్, యాదయ్య, నర్సింహ, బీరప్ప, భాషా, బుచ్చిరెడ్డి, శ్రీశైలం, బాలమ్మ, యాదమ్మ, రాజు, కుమార్, గౌరమ్మ పాల్గొన్నారు.

## కార్మికులపై ఒత్తిడి తగ్గించాలి

కేశంపేట, మార్చి 7: కేశంపేట మండలానికి చెందిన గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావును కలిసి పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఒక్కో కార్మికుడికి రెండు నెలల నుంచి ఆరు నెలల వరకు వేతనాలు చెల్లించలేదన్నారు. కార్మికులపై కార్యదర్శుల ఒత్తిడి తీవ్రంగా ఉందని ఈ విషయమై తగిన సూచనలు కిందిస్థాయి అధికారులకు చేయాలని కోరారు. వారి వెంట తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాజ్యం, ఉప ప్రధాన కార్యదర్శి మలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు రామచంద్రయ్య జైపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

## 13న ఉపాధిహామీ ప్రజావేదిక

షాబాద్, మార్చి 7: ఈ నెల 13వ తేదీన షాబాద్ మండలానికి సంబంధించిన ఉపాధిహామీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అపర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా షాబాద్ మండలంలోని 41 గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో 01-04-2023 నుంచి 31-03-2024 వరకు జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి 15వ సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో కూలీలకు చెల్లించిన వేతనాలు, పనుల నాణ్యత, ఇతర పనులపై సమగ్ర నివేదికలను ఈ నెల 13వ తేదీన షాబాద్ మండల కేంద్రంలోని ఉపాధిహామీ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశానికి సంబంధిత అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులు హాజరుకావాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆదిబట్ల, మార్చి 7 : ఔటర్ రింగు రోడ్డు పై గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం గురువారం ఔటర్ రింగు రోడ్డు పై మొక్కలకు నీళ్లు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఓ కారు ఢీకొనడంతో వనపర్తి జిల్లా, చిన్నంబాయి మండలం, డెక్కం గ్రామానికి చెందిన బత్తిని కృష్ణారెడ్డి(45) కి తీవ్రగాయలు కావడంతో అతడిని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## పకడ్బందీగా ఉపాధి పనులు నిర్వహించాలి

యాచారం, మార్చి7: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన సందర్శించారు. కూలీలు చేపడుతున్న ఫాంపాండ్ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలికి పని కల్పించాలన్నారు. పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, కూలీలు ఉన్నారు.



యాచారం మండలం చౌదర్‌పల్లిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

## నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

షాబాద్, మార్చి 7: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో రూ.5లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అత్యధికంగా నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు ఖాజామియా పటేల్, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లింగం, శేఖర్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, నర్సింహులు, రవీందర్‌నాయక్, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, రఫిక్, రాఘవేంద్రస్వామి, చంద్రారెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

### ముగ్గురికి గాయాలు

### శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ఘటన

ఆదిబట్ల, మార్చి 7: శుభకార్యానికి వెళ్లి ఆటోలో తిరిగి వస్తుండగా, ఓ వ్యక్తి తన బైక్‌తో అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టడంతో అందులో ఉన్న మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడకు చెందిన వడ్త్యవత్ పుణ్య, తన భార్య వి.రాములమ్మ, అతడి తల్లి కవిత, ఆటో డ్రైవర్ కె హేమతో కలిసి మన్నెగూడలోని ఓ గార్డెన్‌లో తమ బంధువుల శుభకార్యానికి వెళ్లి ఆటోలో వస్తుండగా, బుద్ధ విగ్రహం వద్ద గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి తుర్కయాంజాల్ వైపు నంబర్ ప్లేట్‌లేని మోటర్ సైకిల్ వేగంగా వచ్చి ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కవిత(49) అక్కడికక్కడే మృతి చెందింది. అందులో ప్రయాణిస్తున్న వి పుణ్య, వి రాములమ్మ, ఆటో డ్రైవర్ కె హేమాకు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. కవిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## యువకుడు అదృశ్యం



జస్వంత్ సింగ్ (ఫైల్)

చేవెళ్లటౌన్, మార్చి 7: పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చేవెళ్ల ఎస్సై శ్రీ కాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన హీర్ సింగ్మా కొన్ని సంవత్సరాల క్రితం చేవెళ్లకు వచ్చి ఓ ప్లైవుడ్ షాప్ పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా, మూడు నెలల నుంచి ఇతడి వద్ద జస్వంత్ సింగ్ (18) పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే 6వ తేదీన రాందేవ్ ప్లైవుడ్ షాప్‌కు పనికి వెళ్లాడు. పని ముగించుకుని రూమ్‌కి వెళ్లిపోయాడు. జస్వంత్ రూమ్‌కి హీర్‌సింగ్మా వెళ్లి చూడగా, అతడు కనిపించలేదు. దీంతో హీర్ సింగ్మా చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీ కాంత్‌రెడ్డి తెలిపారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

షాబాద్, మార్చి 7: మండల పరిధిలోని అంతారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏఎంసీ చైర్మన్ మమత, ఉపాధ్యాయురాలు లలిత, శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, చంద్రకళను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

నందిగామ, మార్చి 7 : మండల కేంద్రంలోని దేవాలయాలు, మసీదులు, ముఖ్యకూడళ్లలో గ్రామానికి చెందిన యువనేత సదర్ శ్రీనుయాదవ్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం నందిగామ సీఐ ప్రసాద్ వాటిని పరిశీలించారు. అనంతరం శ్రీనుయాదవ్‌ను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బాలుయాదవ్, మారుతి, రాములు, పులిందర్‌రెడ్డి, నర్సింగ్ ఉన్నారు.